నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 30 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

బజార్‌హత్నూర్‌లో బ్యాటింగ్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఓటమి విజయానికి తొలిమెట్టు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్, డిసెంబర్29 : క్రీడల్లో ఓటమి విజయానికి తొలిమెట్టు అని, గెలిచే వరకూ ప్రయత్నించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ఆదివారం బజార్‌హత్నూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి ముఖ్య అతిథులుగాహాజరై మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, ఇందులో గెలుపోటములు సహజమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించామని, గ్రామగ్రామనా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సరదాగా జోగు రామన్న బ్యాటింగ్ చేయగా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం కలిగించారు. కబడ్డీ పోటీల్లో విజేతగా మోహాద జట్టు, ద్వితీయ విజేతగా బజార్‌హత్నూర్, క్రికెట్‌లో విజేతగా సోంపల్లి, ద్వితీయ విజేతగా బజార్‌హత్నూర్ జట్టు నిలిచాయి. వీరికి బహుమతులు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవతో బజార్‌హత్నూర్ లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం, నాయకులు చిల్కూరి భూమయ్య, చట్ల గజ్జయ్య, లక్ష్మణ్, సాయి చైతన్య, కవీందర్, చంద్రశేఖర్, శరత్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

భీంపూర్, డిసెంబర్ 29: బేల్సరిరాంపూర్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండడం అభినందనీయమని, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సూచించారు. భీంపూర్ మండలం బేల్సరిరాంపూర్‌లో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే ఆదివారం రాత్రి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో కాసేపు కబడ్డీ ఆడారు. గ్రామీణ యువత, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తెలంగాణ, మహారాష్ట్ర క్రీడాకారులు పాల్గొన్నారు.

బేల్సరిరాంపూర్‌లో కబడ్డీ ఆడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి ● నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 29 : నూతన సంవత్సర వేడుకలను నిర్మల్ జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31న నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర పట్టణాలతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, మైనర్లకు బైకులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ట్రిపుల్ రైడ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని అతి వేగంతో వాహనాలు నడుపవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, గుంపులు గుంపులుగా రోడ్లపై తిరిగినా నిబంధనలు ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

● 20 రోజులుగా సమ్మెలో ఎస్ఎస్ఏ ఉపాధ్యాయులు
● ఇప్పటికీ పూర్తి కాని సిలబస్..
● ఆందోళనలో పది, ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులు
● ఇంటిబాట పడుతున్న విద్యార్థులు
● ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శాశ్వత పరిష్కారం కాదంటున్న ఉపాధ్యాయ సంఘాలు

కుంటాలలోని కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థులు

సమ్మెలో టీచర్లు.. సాగని చదువులు

కేజీబీవీల్లో అరకొరగా విద్యాబోధన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 29 : ఉపాధ్యాయులు లేక, విద్యా బోధన అందక కస్తూర్బాలో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిర్మల్ జిల్లాలోని 18 కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, మండల విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది, క్లస్టర్ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం నుంచి జిల్లాలోని కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో పూర్తి స్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్నారు.

అరకొరగా తరగతులు నిర్వహణ

జిల్లాల్లోని కేజీబీవీ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు జనవరి మొదటి వారానికి పూర్తి స్థాయిలో సిలబస్‌ను బోధించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 6-9 తేదీ వరకు సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతో 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అప్పటి నుంచి విద్యా బోధన నిలిచిపోవడంతో ఇప్పటికీ సిలబస్ పూర్తి కాలేదు. మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండగా...మార్చి 21 నుంచి ప దో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలపై ఇటు విద్యార్థు లు అటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇటీవల పలు చోట్ల ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థినులను తల్లిదండ్రులు ఇండ్లకు తీసుకెళ్తున్నారు. నాన్ టీచింగ్ సిబ్బందితో విద్యాశాఖలో జరగాల్సిన పనులన్నీ నిలిచిపోయాయి.

ఫలితమివ్వని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో సీనియర్ మహిళా ఉపాధ్యాయులను కేజీబీవీ ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఒక్కో కేజీబీవీ పాఠశాలలో 10-15 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించగా ఇప్పుడు ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను కేజీబీవీల్లో నియమించడం, పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహించకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

తల్లిదండ్రులను అనుమతించని సిబ్బంది..

కుభీర్, డిసెంబర్ 29 : ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో కస్తూర్బాల్లో విద్యార్థుల చదువులతో పాటు వారి యోగ క్షేమాలపై ఇటీవల పలుచోట్ల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కస్తూర్బా విద్యాలయాల్లోకి ఎవరినీ అనుమతించవద్దని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఆదివారం మధ్యాహ్నం కుభీర్‌లోని కేజీబీవీకి గేటుకు తాళం వేసి ఉంచారు. పిల్లలను చూసేందుకు దూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు రాగా వారిని లోనికి అనుమతించకపోగా, కనీసం మాట్లాడించేందుకు కూడా సిబ్బంది నిరాకరించారు. ఇన్‌చార్జి ఎస్ఓ(నిగ్వ హైస్కూల్ టీచర్) అక్కడే ఉండి ఎవరినీ రాకుండా చూశారు.

కుభీర్‌లోని కేజీబీవీలోకి అనుమతించకపోవడంతో గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులు

డిప్యుటేషన్ విధానాన్ని విరమించుకోవాలి

20 రోజులుగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమ్మెను నీరుగార్చేందుకే కస్తూర్బాల్లోకి ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపిస్తున్నది. ఈ విధానం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. ఇటు ప్రభుత్వ పాఠశాలలో అటు కేజీబీవీల్లో విద్యాభ్యాసం కుంటుపడుతుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలి.

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్

శనివారం జాం గ్రామంలోని కేజీబీవీ వద్ద విద్యార్థినులను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు రాఘవులు మృతి

భామన్ రాఘవులు (ఫైల్)

తానూర్, డిసెంబర్, 29 : మండలంలోని భోసి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు భామన్ రాఘవులు (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. 2010 జనవరి 11న మొట్ట మొదటి సారిగా భోసి గ్రామంలో ఆయన 5 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మృతి సందర్భంగా నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ముష్కమ్ రామకృష్ణ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు ప్రకటించిన పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్జీయూకేటీలో 'చేర్యాల్' పేయింటింగ్

బాసర, డిసెంబర్ 29 : బాసర ఆర్జీయూకేటీలో నిర్వహిస్తున్న 'చేర్యాల్' పేయింటింగ్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసినట్లు ట్రిపుల్ఐటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చేర్యాల పేయింటింగ్‌లో నిపుణైన సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ప్రముఖ కళాకారుడు నాగేశ్వర్ రావు, సాయికిరణ్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మూడు రోజుల శిక్షణ శిబిరంలో దాదాపుగా 60మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పిక్‌మీ కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్ రెడ్డి, బద్రి నారాయణ, నాగలక్ష్మి, విద్యార్థి కో ఆర్డినేటర్, మహబూబ్, విజయ్‌యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కంటెంట్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

డిజిటల్ కంటెంట్‌తో మెరుగైన బోధన

ఎదులాపురం, డిసెంబర్ 29 : ప్రభుత్వ విద్యా కేంద్రాల్లో డిజిటల్ మధ్యమాలతో బోధన అందిస్తే అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడుతాయని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉపకరించేలా జైనథ్ మోడల్ స్కూల్, కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు గోస్కుల సత్యనారాయణ రూపొందించిన ఉచిత డిజిటల్ కంటెంట్‌ను ఆదివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన అధ్యాయాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థుల కోసం ఇంగ్లిష్ మీడియంలో రూపొందించిన కంటెంట్ ఇటు బోర్డు పరీక్షలతో పాటు అటు నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా తయారు చేసినట్లు సత్యనారాయణ తెలిపారు. సీడీ, లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా ఉచితంగా ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఈవో ప్రణీత, కేజీబీవీ జిల్లా ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఆరోగ్య పాఠశాల సంధానకర్త అజయ్, ప్రిన్సిపల్ రాము పాల్గొన్నారు.

వాగ్దానాలు నెరవేర్చాలి

● అఖిలపక్ష నాయకుల డిమాండ్ ● రోడ్డుపై కూర్చొని భోజనం చేసి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన ● నిర్మల్‌లో మౌన దీక్ష

ఎదులాపురం, డిసెంబర్ 29 : సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటం రాజ్యాంగ, న్యాయ బద్ధమైనదని.. ఎన్నికల్లో పీసీసీ హోదాలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు కొనసాగిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆదివారం వారు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు బండి దత్తాద్రి, విజ్జగిరి నారాయణ, దర్శనాల మల్లేశ్ వెంకట్ నారాయణ, మునిగెల నరసింహులు నంది రామయ్య దేవేందర్ మాట్లాడుతూ వెంటనే ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అప్పటి వరకూ ఉద్యోగుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వీరి సమస్యలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. అనంతరం ఇచ్చోడ విశ్రాంత ఎంఈవో ఆర్. నారాయణ, బేల సీసీవో, ఎంఐఎస్ అథుల్, మిథున్ కలిసి అన్నదానం ఏర్పాటు చేయగా ఉద్యోగులు రోడ్డుపై కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు రవీందర్, ప్రియాంక, పార్థసారథి, రవి, వెంకటి, కేశవ్, ప్రశాంత్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎదులాపురం : రోడ్డుపై సహపంక్తి భోజనం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జాతీయ రహదారిపై మౌన దీక్ష

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 29 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నది. నిరసనలో భాగంగా జాతీయ రహదారిపై నోటికి గుడ్డ కట్టుకుని మౌన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రచారి, టీపీజీఎఫ్ రాష్ట్ర నాయకులు ఆరెపల్లి విజయ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్ : నోటికి నల్ల గుడ్డ కట్టుకొని మౌన దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సీసీఐ పత్తి విక్రయాల్లో దళారుల దందాపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం

పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ

● 'నమస్తే'కథనానికి స్పందన

ఆదిలాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లలో దళారుల దందాపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం పత్రికలో 'మాయజాలం, పత్తి కొనుగోళ్లలో దళారుల దందా' శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళారులు భారీ ఐచర్ వాహనాల్లో వందల క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చి ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో విక్రయించారు. కొందరు రైతులు పత్తి పంటను సాగు చేయకున్నా పండించినట్లు వారి పాస్ పుస్తకాలను తీసుకువచ్చి రైతుల పేరిట పంటను మద్దతు ధర క్వింటాలుకు రూ. 7521తో విక్రయించారు. దళారులు గ్రామాలు, మండల కేంద్రాల్లో తక్కువ ధరకు పంటను కొని సీసీఐకి ఎక్కువ ధరకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. ఈ అక్రమ వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ'లో కథనాన్ని ప్రచురించింది. విజిలెన్స్ అధికారులు నాలుగు రోజుల్లో పత్తిని అమ్మిన వివరాలను మార్కెట్‌యార్డులో సేకరించి పూర్తి స్థాయి విచారణ జరుపనున్నారు.